క్లుప్తంగా

కుంభమేళాకు ఆహ్వానం



సంగ్రాంమహారాజ్

నారాయణఖేడ్: అఖిలభారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, ఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహారాజ్‌కు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు ఆహ్వానిస్తూ ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఆహ్వానం పంపింది. శనివారం ఆహ్వాన పత్రిక ఆయనకు చేరింది. గతంలో ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్వహించిన బలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రాష్ట్రం నుంచి సంగ్రాంమహారాజ్‌కు మాత్రమే ఆహ్వానం అందింది. కుంభమేళాకు ఆహ్వానం అందడం పట్ల సంగ్రాంమహారాజ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. త్వరలోనే వెళ్లనున్నట్లు తెలిపారు.

రూ.142 కోట్లతో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.లలిత

ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఐదేళ్లుగా తెల్లాపూర్ మున్సిపల్ అభివృద్ధికి సహకరించిన వారికి తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.లలిత కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.142 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని గ్రామాలు అభివృద్ధిలో ముందుకు దూసుకొని పోతుందని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములు గౌడ్, కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్ పాల్గొన్నారు.

అధిక మార్కులు సాధించాలి



మునిపల్లి మోడల్ స్కూల్‌లో డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్

మునిపల్లి(అందోల్): ప్రతి విద్యార్థి అధిక మార్కులు సాధించాలని డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ విద్యార్థులను కోరారు. శనివారం మండల కేంద్రమైన మునిపల్లి మోడల్ స్కూల్‌లో పర్యటించారు. ఉపాధ్యాయులు బోధించిన ప్రతి పాఠ్యాంశాన్ని శ్రద్ధగా విని పరీక్షల్లో అధిక మార్కులు సాధించాలని ఆయన కోరారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ, ఎంఈఓ, భీంసింగ్ ప్రిన్సిపాల్ మల్లిక పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

హత్నూర(సంగారెడ్డి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్‌ఐ సుభాష్ అన్నారు. శనివారం హత్నూర మండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనదారులు లైసెన్స్, ఇన్సూరెన్స్ బండి పేపర్లు కలిగి ఉండాలని సూచించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించుకోవాలని సూచించారు. తాగి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ దుర్గయ్య, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డిలో జిల్లా స్థాయిలో జరుగుతున్న అబాకస్, వేదిక మ్యాథ్స్ పోటీలకు పట్టణంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు అరవింద శ్రీ శనివారం తెలిపారు. పాఠశాల నుంచి వేదిక మాథ్స్ విభాగంలో భావన, వర్ణిక, అరిసియా, అబాకస్ స్టార్ జూనియర్స్ శ్రీదేవి, హర్షిత, సిదీక్ష, సహస్ర, వైష్ణవి, సీనియర్స్ రితిక, అక్షితగౌడ్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఆదివారం విద్యార్థులు పాల్గొంటారన్నారు.

గ'తుకు'్క'రోడ్డు

- అల్లాదుర్గ్–మెటల్‌కుంటా రోడ్డు గుంతలు పూడుస్తున్న వైనం
- వారం రోజుల్లోనే తిరిగి గుంతలుగా మారుతున్న రోడ్డు
- ఎవరు పూడుస్తున్నారో తెలియదంటున్న అధికారులు



గుంతలమయంగా మారిన రోడ్డు

వట్‌పల్లి(అందోల్): తెలుగు రాష్ట్రాల్లో సుమారుగా 44 కిలోమీటర్ల దూరం మేర ఒక్క మూల మలుపు లేకపోవడం అల్లాదుర్గ్–మెటల్ కుంట రోడ్డు ప్రత్యేకత. గతంలో ఈ రోడ్డుపై ప్రయాణం అంటే సాఫీసాగిపోయే కారణంగా ఈ మార్గం గుండా ప్రయాణించేందుకు వాహనదారులు ఎక్కువగా ఇష్టపడేవారు. ఇదంతా ఒకప్పుడు మాత్రమే...ఇప్పుడు మాత్రం ఈ రోడ్డు గుండా ప్రయాణమంటే నరకప్రాయమే మరి. రాష్ట్రంలో అతిపెద్ద రోడ్లలో ఒకటైన ఈ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోకవడంతో బీటీరోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆర్ అండ్ బీ శాఖ సిబ్బంది తూతూ మంత్రంగా ట్రాక్టర్ల కొద్దీ మొరం (మట్టి)తో గుంతల్ని పూడ్చారు. వట్‌పల్లి నుంచి రాయికోడ్ చౌరస్తా వరకు ఇలా మట్టితో గుంతలు పూడుస్తున్నారు. ఫలితంగా కొద్దిరోజులకు మళ్లీ రోడ్డుపై గుంతలు ప్రత్యక్షమవుతున్నాయి. డాంబరుతో మరమ్మతులు చేయాల్సిన తారు రోడ్డును మట్టితో చేపట్టడాన్ని విమర్శిస్తున్నారు. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే తమకేమి తెలియదన్నట్లు సమాధానాలు చెప్పి తప్పించుకుంటున్నారు. అతి పొడవైన రోడ్డు పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

అంతర్రాష్ట్ర రహదారిగా...

ఈ రోడ్డును జాతీయ రహదారి 161ను కలుపుకొని ముంబై జాతీయరహదారితో కలుపుతూ కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు ప్రయాణాలు సాగేలా అంతర్రాష్ట్ర రహదారిగా నిర్మించి అనుసంధానం చేశారు. ఈ రోడ్డు గుండా బీదర్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. మంత్రులు,ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి అధికారులు ఈ రోడ్లపై ప్రయాణిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అవేమీ పట్టనట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అల్లాదుర్గ్–మెటల్‌కుంట రోడ్డుపై వెళితే ద్విచక్రవాహనాలు, కార్లు, ఇతర వాహనాలు చెడిపోవడం ఖాయం.పెద్ద పెద్ద గుంతల నుంచి వెళ్లడం వల్ల కార్లు రిపేరింగ్‌కు వస్తున్నాయి. ద్విచక్రవాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. వట్‌పల్లి,

ఈ రోడ్డుపై వెళితే వాహనాల పరిస్థితి అంతే..

అల్లాదుర్గం ప్రాంతానికి చెందిన వారు రాయికోడ్, మెటల్ కుంట, జహీరాబాద్ ప్రాంతాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సిందే. ఈ రోడ్డుమీద ప్రయాణిస్తున్న వాహనదారులు మాత్రం వాహనాలు చెడిపోయినా ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తున్నారు.

రూ.64 కోట్లతో ప్రతిపాదనలు..

అల్లాదుర్గ్ నుంచి 34 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణం కోసం రూ. 64 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ఇప్పటికే 13 కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నాయి. నిధులు విడుదలలో జాప్యం జరగడంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేసింది వాస్తవమే. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం. ప్రస్తుతం రోడ్డుపై ఉన్న గుంతలను మట్టితో పూడుస్తున్న విషయం నాకు తెలియదు.

–రవీందర్, ఆర్‌అండ్‌బీ, డీఈఈ

ఇప్పుడైనా మరమ్మతులు చేపట్టేనా..?

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి సంబంధించి టెండర్లకు ఆహ్వానించినా ఎవరూ టెండరులో పాల్గొనేందుకు ముందుకు రాలేదని సమాచారం. దీంతో పదేళ్లపాటు రోడ్డుకు ఎటువంటి మరమ్మతులు జరగలేదు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనట్లు ప్రచారం జరిగినా ఎటువంటి పనులు చేపట్టలేదు. నిధులు మంజూరైనా పనులు జరగకపోవడానికి గల కారణాలను మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు నీళ్లు నములుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం పాలనాపగ్గాలు చేపట్టిన తర్వాతైనా ఇప్పటివరకు ఈ రోడ్డు పనులకు ఎలాంటి నిధులు మంజూరుకాకపోవడంతో ఇప్పుడైనా ఈ రోడ్డు బాగుపడుతుందా లేదోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గణతంత్ర ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో పకడ్బందీ ఏర్పాట్లను చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా మాదిరిగానే జాతీయ జెండా ఆవిష్కరణ, వివిధ పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్ ఫాస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ప్రదర్శనలకు అనుగుణంగా మైదానంలో ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మైత్రి మైదానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, మండల విద్యాధికారి నాగేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ రేడియల్ రోడ్డులో భూమి కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ వార్డు కార్యాలయంలో రైతులు, హెచ్‌ఎండీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. తమకు నష్టపరిహారం ఇస్తే రేడియల్ రోడ్డు కోసం భూమిని ఇవ్వడానికి సిద్ధమని రైతులు తెలిపారు. రైతులను కాపాడుకునే బాధ్యత తమపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ రెడ్డి, స్థానిక నాయకులు చిట్టి ఉమేష్, పర్సా శ్యామ్‌రావులు పాల్గొన్నారు.



పటాన్‌చెరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పకడ్బందీగా రేషన్ కార్డుల సర్వే

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా

వట్‌పల్లి(అందోల్): జిల్లాలో జరుగుతున్న రేషన్ కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వర్తించాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ఆ విభాగం కార్యదర్శులకు సూచించారు. అందోల్ మండల పరిధిలోని అన్నాసాగర్, పోసానిపేట గ్రామాలలో చేపట్టిన రేషన్‌కార్డుల పరిశీలన ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కంగ్టి(నారాయణఖేడ్): ఈ నెల 26వ తేదీన ప్రభుత్వం నూతనంగా రేషన్ కార్డులు జారీ చేస్తున్నట్లు ప్రకటించడంతో పాత రేషన్ కార్డుల్లో ఉన్న పేర్లు నూతన కార్డుల్లో రాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రం కంగ్టితో పాటు పలు గ్రామా ల్లో రేషన్ కార్డుల వెరిఫికేషన్‌తో పాటు ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్ నిర్వహించారు. ఎంపీడీఓతో పాటు ఎంపీఓ సుభాష్ ఉన్నారు.



అన్నాసాగర్‌లో రేషన్ కార్డుల సర్వేను పరిశీలిస్తున్న అధికారి సాయిబాబా

'భరోసా' భూముల పరిశీలన

అదనపు కలెక్టర్

సంగారెడ్డి: రైతు భరోసా ఎంపిక ప్రక్రియను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి శనివారం పరిశీలించారు. మండల కేంద్రం చౌటకూర్‌లో వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్న సర్వే తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ కిరణ్ కుమార్, వ్యవసాయ అధికారి ప్రవీణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కంగ్టి(నారాయణఖేడ్): వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములతో పాటు నాలా చేసిన భూములు, ఇళ్లు నిర్మించిన వెంచర్లు, ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న భూములకు రైతు భరోసా వర్తించదని ఏఈఓ భార్గవ్‌చారి తెలిపారు. మండలంలోని బాన్సువాడలో శనివారం సర్వే నిర్వహించి ఇళ్లు నిర్మించిన భూములను పరిశీలించారు.

భూముల పరిశీలన

మునిపల్లి(అందోల్): సాగుకు యోగ్యత లేని భూములను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చేస్తున్న సర్వే పనులను తహసీల్దార్ ఆశాజ్యోతి పరిశీలించారు. శనివారం మండలంలోని లింగంపల్లి, బోద్పట్‌పల్లి గ్రామాలలో పర్యటించారు. నివాస స్థలాలు, గుట్టలు, ప్లాట్లు, వెంచర్లు ఎన్ని ఎకరాలున్నవనే వివరాలను సేకరించారు.



రైతు భరోసా ఎంపిక ప్రక్రియలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

భూముల సర్వే

సంగారెడ్డి టౌన్: వ్యవసాయ అధికారిణి ఝాన్సీ భూముల సర్వే ప్రక్రియను పరిశీలించారు. సాగుకు ఉపయోగంగా లేని భూములు, వెంచర్లకు సంబంధించిన వివరాలను నమోదు చేస్తున్నారు.

సాగు భూములకు రైతు భరోసా

కల్హేర్(నారాయణఖేడ్): సాగు భూములకు రైతు భరోసా పథకం వర్తిస్తుందని నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక్ చక్రవర్తి తెలిపారు. శనివారం మండలంలోని మహదేవుపల్లిలో సాగుకు యోగ్యం కాని భూములు పరిశీలించారు. రాపర్తి, బీబీపేట్‌లో తహసీల్దార్ శివశ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, ఆర్‌ఐ మల్లేశం, ఎఈఓలు సంతోష, కృష్ణవేణి పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన వచ్చిందని మేనేజర్ జాకీర్ హుసేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగిందన్నారు. మొగుడంపల్లిలో బస్సులు ఆపడంలేదని అహ్మద్ ఫిర్యాదు చేశారన్నారు. హైదరాబాద్‌కు బస్సుల సంఖ్య పెంచాలని అప్పం శ్రవణ్ కుమార్, జాడిమల్కాపూర్ బస్సు సమయం మార్చాలని నర్సింహారెడ్డి, ఇందూర్‌కు ప్రతి రోజు బస్సు నడపాలని బోయిన ఈశ్వర్ కోరారని చెప్పారు. బుర్దిపాడ్‌కు సర్వీస్ వేయాలని హన్మంతు, పట్టణంలో బస్సులను రోడ్డు పక్కన ఆపాలని మఠం చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారన్నారు. ఉన్నత అధికారులతో చర్చించి ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకుంటామని డీఎం చెప్పారు.

ఎడ్ల బండ్ల ఊరేగింపు



ఎడ్ల బండ్లను ఊరేగిస్తున్న దృశ్యం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలో శనివారం పాత పంట జాతర నిర్వహించారు. గ్రామంలోని కూడలి వద్ద ధాన్యంతో కూడిన ఎడ్ల బండ్లకు డీడీఎస్ సభ్యులు రైతులు పూజలు నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు.

పేదలకే పథకాలు వర్తింపజేయాలి

నారాయణఖేడ్: ఈ నెలల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న వివిధ సంక్షేమ పథకాలను పేదలైన అర్హులకే వర్తింపజేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. 25వ తేదీ నుంచి సంగారెడ్డిలో నిర్వహించనున్న పార్టీ మహాసభలను పురస్కరించుకుని నారాయణఖేడ్‌లోని పార్టీ కార్యాలయం ఎదుట శనివారం ఆయన జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండా చేసే పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, అర్జున్, సంతోష్, నర్సింహులు, సంజీవులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్: సీపీఎం జెండా ఎగురవేస్తున్న రమేష్

జోగిపేటలో క్రికెట్ పోటీలు ప్రారంభం

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మాజీ మంత్రి దివంగత రాజనర్సింహ మెమోరియల్ క్రికెట్ పోటీలను శనివారం కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు 20 టీంలు పాల్గొంటాయని తెలిపారు. డాకుర్, పోసానిపేట్ జట్ల మధ్య జరిగే పోటీలకు ఆయన టాస్ వేసి ప్రారంభించారు. విజేతకు మొదటి బహుమతిగా రూ.20వేల నగదు, ద్వితీయ బహుమతి రూ.10వేల నగదు, మ్యాన్‌ఆఫ్ ది టోర్నీకి రూ.2వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బౌలర్‌లకు వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు హర్షద్, అఖిల్, హరినాథ్, అశోక్, కాజా తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న కౌన్సిలర్ చిట్టిబాబు

92 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న రత్నాకర్‌రెడ్డి, ఆంజనేయులు

సదాశివపేట(సంగారెడ్డి): లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, మాజీ ఎంపీపీ యాదమ్మ తెలిపారు. శనివారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని 32 మంది లబ్ధిదారులకు రూ 10లక్షల విలువగల చెక్కులను అందజేశారు, కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చింతా సాయినాథ్, నరేష్‌గౌడ్, ఆరిఫొద్దీన్, లక్ష్మారెడ్డి, సంగమేశ్వర్, సలావుద్దీన్, ప్రసాద్‌గౌడ్, మాణేయ్య పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పటాన్‌చెరు టౌన్: బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాటా సుధారాణి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నారాయణఖేడ్: మనూరు మండలం శెల్గిరాతండాకు చెందిన మెగావత్ లక్ష్మణ్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.18,500 మంజూరుకాగా అందుకు సంబంధించిన చెక్కును శనివారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ అర్జున్, నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతినగర్ డివిజన్‌లో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు శనివారం కార్పొరేటర్ వి.సింధు రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో నాయకులు నరసింహ, జైసాల్‌లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం

విద్యార్థులకు ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ హితబోధ

సంగారెడ్డి క్రైమ్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని రిషి హై స్కూలు, తార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని, మైనర్లు వాహనాలు నడపవద్దని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. రీల్స్ కోసం యువత స్పోర్ట్స్ బైక్‌లపై విన్యాసాలు చేయడం ప్రమాదకరమన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ రాములు తెలిపారు. మనం జాగ్రత్తగా ఉంటే సరిపోదని, ఎదుటి వాహనాలను గమనించాలన్నారు. తారా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన 25 మంది ఎన్‌సీసీ క్యాడేట్‌లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ వారం రోజులపాటు సంగారెడ్డిలోని వివిధ కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.



మాట్లాడుతున్న సీఐ సుమన్ కుమార్

కార్పొరేటర్ బస్తీ దర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ బి.పుష్ప అన్నారు.శశనివారం డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో అధికారులతో కలసి బస్తీదర్శన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను త్వరలో పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రఘురాం రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **స.హ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**

నారాయణఖేడ్: సమాచారహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స.హ చట్టం అమలు సొసైటీ ఖేడ్ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఈ చట్టం కింద దరఖాస్తు చేసుకున్నా కొందరు అధికారులు సమాచారం కోరే వ్యక్తులకు సరైన సమాధానం, సమాచారం ఇవ్వడంలేదన్నారు. చట్టం ప్రకారం కోరిన సమాచారాన్ని మాతృభాష(తెలుగు)లో ఇవ్వాల్సి ఉన్నా ఆంగ్లంలో ఇస్తున్నారన్నారు. అన్ని గ్రామాల్లోనూ త్వరలో సంస్థ కమిటీలు ఏర్పాటు చేసి యువతను చైతన్య పరుస్తామన్నారు. సంస్థ సభ్యులు అంబాదాస్, మహేష్, పవన్, భరత్, తరుణ్ పాల్గొన్నారు.

◆ **మీటింగ్ హాల్ ప్రారంభం**

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరాన్ని శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ ఆపర్ణ ప్రారంభించారు. రూ.40లక్షలతో సుందరీకరణ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు శివకుమార్, ఇలియాస్ షరీఫ్, విద్యాసాగర్‌రెడ్డి, రేణుక, రాజేశ్వరీ, కోఆప్షన్ మెంబర్ అంజయ్య పాల్గొన్నారు.

◆ **జీవన్ జ్యోతి బీమా చెక్కుల పంపిణీ**

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ గ్రామంలోని ఏపీజీవీబీ (ప్రస్తుతం తెలంగాణ గ్రామీణ బ్యాంక్)లో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలో ప్రీమియం కట్టిన ఖాతాదారులు మృతి చెందడంతో వారి కుటుంబీకులైన నామినీలకు రూ.2 లక్షల విలువైన చెక్కులు శనివారం మేనేజర్ కే.మహేందర్ పంపిణీ చేశారు. జీవన్ జ్యోతి బీమా యోజన కోసం గతంలో ప్రీమియం తీసుకున్న ఏడాదిలోపే పాలసీదారులు మృతి చెందడంతో వారు సూచించిన నామినీలకు చెక్కులు అందజేసినట్లు తెలిపారు.

◆ **సర్వే పక్కాగా నిర్వహించాలి**

వట్‌పల్లి(అందోల్): వ్యవసాయానికి యోగ్యం కాని భూములను పక్కాగా గుర్తించాలని జోగిపేట ఏడీఏ రమాదేవి సూచించారు. శనివారం అందోలు మండల పరిధిలోని అన్నాసాగర్, సాయిబాన్‌పెట్, అల్మాయిపేట తదితర గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగు భూముల వివరాలు కూగా పక్కాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకర్ రెడ్డి, ఏఓ శ్రీహరి, ఏఈఓ శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ **రాయల్టీ పేరుతో మోసం**

పటాన్‌చెరు టౌన్: ఫంక్షన్ హాల్ యజమానులు రాయల్టీ పేరుతో వినియోగదారులను మోసం చేస్తున్నారని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. వివాహాది శుభకార్యాల విషయంలో ఫంక్షన్ హాలు యజమానులు వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ముమ్మాటికి వినియోగదారుల హక్కుల ఉల్లంఘన అని ఆరోపించారు.

◆ **ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాపర్‌వైర్ చోరీ**

కల్హేర్(నారాయణఖేడ్): గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేశారు. ఆయిల్, కాపర్ వైరు చోరీ చేశారు. మండలంలోని మహదేవుపల్లి శివారులో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. మహదేవుపల్లి శివారులో నేషనల్ హైవే 161 పక్కన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ వైర్ చోరీ చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ నారాయణ తెలిపారు. చోరీ జరిగిన ఆయిల్, కాపర్ వైర్ విలువ రూ. లక్ష వరకు ఉంటుందని తెలిపారు.

◆ **ట్రాన్స్‌కో పనితీరుపై పరిశీలన**

సంగారెడ్డి: జిల్లాలో విద్యుత్ వినియోగంపై ఆ శాఖ చీఫ్ ఇంజనీర్ కామేష్ శనివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం సంగారెడ్డి కార్యాలయంలోని సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. వినియోగదారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం జహీరాబాద్ వెళ్లి అక్కడి సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీనాథ్, డీఈలు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఏడీలు ఉన్నారు.